
# చంద్రావతి నవ్వింది



-పాలెపు బుచ్చిరాజు

చంద్రావతీ, సరళా బూజమ్ ఫ్రెండ్స్. ఒకే కంచం లో తిని ఒకే మంచంలో పడుకునేంతటి స్నేహం వాళ్ళది. వాళ్ళు చదువుతున్నది కూడా ఒకే కాలేజీలో ఒకేక్లాసు.

అదే క్లాసులో చదువుతున్న నాకూ, మా రూపేష్ గాడికీ కూడా వాడి కళ్ళద్దాలంత థిక్కు ఫ్రెండ్షిప్పుంది. చంద్రావతికి సరళతో చెప్పుకోగూడనంతటి రహస్యా లేమీ లేవు. రూపేష్‌కీ నాకూ డిటో! అది మాకో తుత్తి మరి.



చంద్రావతి చూట్టానికి చాలా అందంగా ఉంటుంది. అలా ఉంటే మనకేం బాధ లేదు. కాని ఉండి ఉండీ ఇహ ఉండబట్టలేక, బొడ్డుమల్లి, నల్ల తుమ్మెదని ఆకర్షించినట్టు మా వాణ్ణి ఆకర్షించడం మొదలెట్టింది.

అది మొదలు వాడి ఇక్కట్లకు.

ఓ శుభోదయాన సమయం చూసుకుని మా వాడు అపరాధ పరిశోధకుడిలా చంద్రావతిని అనుసరించి ఆమె 'చిరు' నామా సంపాదించాడు.

ఆ తరువాత, సాయంత్రం సమయంలో వాడి అడ్రసు, వాడు, కేరాఫ్ చంద్రావతి ఇంటి నాలుగ్గోడలు.

నేను వాడితో ఎప్పుడు కలిసిమాట్లాడు దామనుకున్నా అక్కడికే రీడైవర్టు కావలసి వచ్చేది.

★ ★ ★

మీరేమైనా అనుకోండి. నేన్నిజం చెప్పేస్తున్నాను. రూపేష్‌గాడా పేరు వాడే అరువు తెచ్చుకుని పెట్టుకున్నాడు, అమ్మా నాన్నా చిన్నప్పుడు పెట్టిన అసలు పేరు నచ్చక.

అందువల్ల మనకి ఇష్టం ఉన్నా లేకపోయినా అనుభవించక తప్పదు. కేవలం పేరు పెట్టకోవడంతో ఆగితే మనకేం పోయేదిలేదు.

ఆ రూపానికి తగ్గట్టుగా వాడి చెల్లెలి డ్రెస్సింగ్ టేబిల్ మీది మేకప్ సామానంతా వాడేసి గంట న్నరసేపు 'తయార' వుతాడు వీధిలో పడే ముందు.

"ఏమిట్రా! నీకే చాద స్తం?" అన్నామో ఆకాస్తా మన మీద విరుచుకుపడతాడు.

అసలు వాడిఉద్దేశంలో వాడు చాలా అందగాడు.

కనుక, అలా అలా నలుగురితో రోడ్డుమీద నడుస్తూండగా, ఏదైనా ఇద్దైతే... అంటే ఏ అమ్మాయేనా ఓరగా ఇలా చూస్తే అందర్లోకీ తన మొహం కొట్టొచ్చినట్టు కనబడాలి.

అదీ వాడికోరిక. 'ప్రేమ బీజం' అంటే ఆ మొదటి చూపే అనీ, అదే కొన్నాళ్ళకి పెరిగి వివాహవృక్షం అవుతుందనీ వాడి దురాశ. అందుకే వాడికి నేను "రూప మ్మన్యుడు" అని పేరు పెట్టాను.

ఈ కథ ఇక్కడ ఇలా ఉండగా ఓరోజు జరగవలసిన ఘోరం జరగనే జరిగింది.

ఏ దుర్ముహూర్త కాలంలో, ఏ యాంగిలులో, ఏ మెల్ల కంటితో చూశాడో ఏమో, దఢాల్న నా దగ్గరికి వచ్చి వాలి, "ఒరేయ్! చంద్రావతి నన్ను చూసి నవ్విందిరా!" అన్నాడు.

చెప్పొద్దూ! నేను డంగైపోయాను. నేనింత తేలిగ్గా మూడు ముక్కల్లో మీకు చెప్పాను కానీ, నా సామిరంగా! మా వాడు నాతో ముచ్చటగా ముప్పావు గంటసేపు, మరిపించి, మరిపించి, ముప్పతిప్పలూ పడి, మూడు చెరువుల నీళ్ళు తాగి, తాగించి ముగించేసరికి మురుగయ్యాన్ కేఫ్‌లో ముప్ఫైరూపాయల బిల్లు అయింది. (వాడికేలెండి!)

మరినేను డంగై పోయానంటే పోనూ? ఆ తరువాత వాడు నన్ను పెట్టేసిన బాధ మీకు తెలియదు. బ్రహ్మదేవుడికి తెలుసు."

"నవ్విందిరా!" అంటాడు.

"ఆమె అందమే అందమంటే!" అంటాడు.

అలాంటి వాళ్ళ తలలో పువ్వైపుట్టితే చాలట. ఆమె తొడిగే హవాయ్ చెప్పులజన్మ తరించిందట!

"సరేలేరా! ఊరుకో!" అంటే, ఊరుకోడే!

"నీకు తెలీయదు ఫో!" అంటాడు.

"ఇహ ఆగేదే లేదు!" అన్నాడోనాడు.

"ఏ గేదె?" అని అడిగాను.

"ఛీ!ఫో! నీ దెప్పుడూ పేడబుద్దే అని కేకలేశాడు నన్ను.

సమయం చూసుకుని హృదయాన్ని ఆమె పాదాల మీదికి విసిరేస్తానన్నాడు.

"నీ ఖర్మ! ఫో" అన్నాను నేను. అన్నాను గాని, అన్నంత పనీ వాడు చేసేస్తాడని నేనేమైనా కలగన్నానా?

★ ★ ★

"మీ ఫ్రెండంత పిచ్చివాడేమిటండీ" అని సరళ నన్న డక్కపోతే అసలు విషయం నాకు తెలిసిఉండేది కాదు.

"ఏం జరిగిందండీ! నాకేం తెలియదే?" అని నేనడిగితే...

"మనమంతా మిత్రులం కదా! ఒకరి మంచి చెడ్డలు మరొకరు చూసుకోకపోతే ఎలా?" అని ఇన్ని అక్షింతలు వానెత్తిమీద జల్లి, చంద్రావతి తనతో చెప్పినట్టుగా, సరళ నాతో మా రూపమ్మన్యుడి ఎపిసోడ్ చెప్పిన విధానం

చంద్రావతీ ఉవాచ: "అది కాదబ్బా! ఎంతసేపని ఓపిక పట్టడం! రోజూ వెనకాల పడుతూంటే! పైగా కుక్కకూత లూ, నక్క కూతలూ!

ఎవ్వరూ లేని సమయంలో రోడ్డు కడ్డంగా నిలబడి, కళ్ళు మూసుకుని, కంఠతా పట్టు కొచ్చిన ప్రలాపాలు, ఇష్టం వచ్చినట్టు గబ గబా పేలేస్తు న్నాడు.

సిగలో పూవట! కాలికి చెప్పట! ఇంకా ఏమేమో నట! పైగా లెటరుకూడా రాశాట్ట. పోస్టు చేయడానికి ధైర్యం చాలలేదట.

సిగ్గులేకపోతేసరి చెప్పుకోడానికి. నాకు అరికాలి మంట నెత్తికెక్కిందంటే నమ్ము.

అప్పుడే బజారులో కొని తొడుక్కొస్తున్న హై హీల్డు షుతో అతని దవడ మీద ఒక్కటిచ్చుకుని "సారీ! కొత్త షూలెండి! గట్టిగా తగిలిందేమో!" అనిచెప్పి మరీ ఇంటి కొచ్చేశాను."

ఈ కథ ఇక్కడితో పూర్తిచేయక చంద్రావతి వాళ్ళ బామ్మగారు ఈ విషయమై పలికిన బ్రహ్మవాక్కు కూడా ఇలా వినిపించింది సరళ.

"ఓరి వీడి అఘాయిత్యం గూల! మంచిపనే చేశావమ్మా! లేకపోతే రోడ్డుమీద పట్టుకుని నోటికొచ్చినట్టు కూస్తాడా! ఈ కాలపు పిల్లలేమిటోనమ్మా! అసలు ప్రేమకి నిర్వచనం తెలుసా వీళ్ళకీ అంట!"

అంతే! విషయం కూలంకషంగా అర్థం చేసుకున్నాక, మావాడికి జరిగిన పరాభవానికి కడుపులో దేవేసినట్లయి, అక్కడ ఉండలేక,

"ఓ! అదా! నాకిదంతా తెలియదండీ! నాల్రోజులుగా వాడు కనిపించకపోతే ఏ తలనొప్పో అనుకున్నాను."

అని అతకని అబద్ధం ఒకటి పారేసి, ఆమె బారినుంచి తప్పించుకుని, రూటు మార్చి రూపమ్మన్యుడి ఇంటికి వెళ్ళాను.

అక్కడిసీను ఏ విధంగా ఉందయ్యా అంటే కేసు ఏ విధంగా పెడితే మనం గెలుస్తాం? అని ఆలోచిస్తున్నారు వాడి నాన్నగారు. ఆయన అడ్వొకేటులెండి.

"అసలీవంశంలో ఉన్నదే అదీ!" అని గొణుక్కుం టూంది వాళ్ళమ్మ వీరమాత! చిన్నప్పుడు వాళ్ళాయన కూడా ఇలాగేచేసిన విషయం గుర్తు కొచ్చిందేమో!

పళ్ళూడిపోయిన దవళ్ళు నొక్కుకుంటూ వాళ్ళబామ్మ భరతవాక్యం పలుకుతోంది.

"హారి! దాని అఘాయిత్యం గూల! రోడ్డుమీద పట్టుకుని చెప్పుతో కొడుతుందిరా? ఎంత యిదయినా అంతయిదా? మా కాలంలో మేం ఇలాగే చేశామా!" అని.

నేను మెల్లగా అడుగులో అడుగులేసుకుంటూ మా రూపమ్మన్యుడి గదిలోకడుగుపెట్టాను.

ఆముదం తాగిన మొహంపెట్టి వాడు అన్నాడు కదా! "అది కాదురా! చంద్రావతి ఆవేళ నాకేసి చూసి నిజంగానే నవ్వింధిరా!"

పి.బి. రాజ
36, శంకేశ్వర్ సొసైటీ,
మకర్‌పురా రోడ్.
బరోడా - 390 009.
గుజరాత్ స్టేట్.




"ఏమేవ్! వంట ఎలా ఉంది?"

"మీ మొహంలా ఉంది"

"హమ్మయ్య! నీ మొహంలా చెండాలంగా ఉంది అంటావేమో అనుకున్నాను"

-పాలుమూరి సంపత్‌కుమార్.
ఇ.నం.3-8-17,రేచర్లపేట.
కాకినాడ-3.

